క్లుప్తంగా

బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్: రంగారెడ్డి జిల్లా కోర్ట్ ఆవరణలో ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి రెండోసారి ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న న్యాయవాదులందరికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

మునిపల్లి(అందోల్): ఈ నెల 10వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరినందన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శైలజాశివశంకర్, జడ్పీటీసీ మీనాక్షి అధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పుర వీధుల్లో నగర సంకీర్తనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నగర సంకీర్తనకు మంచి స్పందన వస్తోందన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే నగర సంకీర్తనలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని సూచించారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందజేశారు.

బండి సంజయ్‌కు సన్మానం



కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రిగా ఎన్నికైన బండి సంజయ్‌ను సదాశివపేట పట్టణానికి చెందిన బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నేమలికొండ వేణుమాదవ్ ఆదివారం ఢిల్లీలో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి ఉన్నారు.

టార్గెట్ బాల్ పోటీలకు ఎంపిక



మధుసూదన్



ప్రవీణ్‌కుమార్

రాయికోడ్(అందోల్): రాజస్థాన్ రాష్ట్రంలోని అల్వార్‌లో ఈ నెల 10వ తేదీ నుంచి 15 వరకు నిర్వహించనున్న 11వ జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలు జరగనున్నాయి. రాష్ట్రం నుంచి పాల్గొనే సీనియర్స్ జట్టుకు రాయికోడ్‌లోని రాయికోడ్‌లోని రాధాకృష్ణ పాఠశాల ఉపాధ్యాయుడు మధుసుధన్, జూనియర్స్ జట్టుకు విద్యార్థి ప్రవీణ్‌కుమార్ ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ పాండు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని తమ పాఠశాల నుంచి ఇద్దరు ఎంపిక కావడంపై సంతోషంగా ఉందని తెలిపారు.

క్రీడాకారులను ప్రోత్సహించండి



నృత్యం చేస్తున్న చిన్నారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడాకారులను ప్రోత్సహించాలని బెల్ ఈడీ కేబీ.రాజా అన్నారు. శనివారం రాత్రి బెల్ కమ్యూనిటీ సెంటర్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవిలో బెల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ క్రీడాలు, సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. బెల్ క్రీడామైదానంలో ఆడిన అనేక మంది క్రీడాకారులు నేడు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని వివరించారు. క్రీడాకారుల అభివృద్ధికి బెల్ యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బెల్ జీఎం చంద్రశేఖర్, అధికారులు సురెన్ ప్రసాద్, మాయబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో భద్రం





రాపర్తి గ్రామంలోని పరిసరాల్లో నిలిచిన మురుగునీరు

- అప్రమత్తత పాటించకుంటే అనారోగ్య సమస్యలు
- పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు చెక్
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. దోమలు స్వైర విహారం చేస్తుంటాయి. దీంతో ఆరోగ్య సమస్యలు వస్తాయి. ప్రధానంగా మలేరియా, డయేరియా, చికున్‌గున్యా వ్యాధులు రావడంతో ఆరోగ్యంపై తీవ్ర పభావం చూపుతుంది. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు, ఈగలు అధికమవుతాయి. ఇక వర్షాకాలంలో వరద నీరు రావడం , వాతావరణంలో మార్పులు రావడం వల్ల వివిధ రకాల వ్యాధులు ప్రభలే అవకాశం ఉండటంతో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, దీంతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. – కల్హేర్(నారాయణఖేడ్)

కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని ఆయా ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండటం.. రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారడంతో నీరు నిలిచి అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. మార్డి, మీర్ఖాన్‌పేట, మునిగేపల్లి, బీబీపేట, ఫత్తెపూర్, మహదేవుపల్లి, దేవునిపల్లి, కల్హేర్, వాసర్, చీమల్‌పాడ్, కడ్పల్, సంగెం, తదితర తండాల్లో వీధి రోడ్లు అధ్వానంగా మారడంతో వర్షం నీరు నిల్వ ఉంటోంది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు, పరిసరాలు నీటితో నిండిపోయి మురుగు కుంటలుగా మారుతున్నాయి.

దోమలు వ్యాప్తి చెందే అవకాశం

ఇంటి పరిసరాల ప్రాంతాల్లో పాత కుండలు, టైర్లలో వర్షం నీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు వాటిని అవాసాలుగా మార్చుకొని అధికసంఖ్యలో వృద్ధి చెందుతాయి. దీంతో డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇక ఇళ్లల్లో బిందెలు, ఇతర వంట పాత్రల్లో నీరు నిల్వ ఉండటం, వాటిపై ఎలాంటి పాత్రలు పెట్టకపోవడంతో నీటిలో పెరిగే ఏడీస్ దోమ ద్వారా చెకెన్ గున్యా జ్వరం వచ్చే అవకాశం ఉంది.

దోమల నివారణకు చర్యలు

చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మురుగునీరు లేకుండా జాగ్రత్తలు పాటించాలి. ఇంటి ఆవరణలో గోళాలు, కుండలు, ఇతర పాత్రలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. బ్లీచింగ్ ఫౌడర్‌ను చల్లుకోవడం మంచిదని, నీరసంగా ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.

శుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కలుషితమైన నీటి ద్వారా రకరకాల వ్యాధులు వస్తాయి. నీరు నిల్వ ఉన్న పాత్రల్లోనే దోమలు ఎక్కువగా గుడ్లు పెడతాయి. దీంతో నీటిని ఎప్పటికప్పుడు పారబోయడం ద్వారా దోమలు నశిస్తాయి. తాగే నీటిని తప్పకుండా వేడి చేసి చల్లార్చి వడబోసిన అనంతరమే తాగాలి. తాజాగా ఉన్న భోజనం తినాలి.

– విజయ్‌కుమార్, వైద్యాధికారి, సిర్గాపూర్ పీహెచ్‌సీ

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ జూనియర్ కళాశాలలో ఆదివారం 2001–2004 సంవత్సరపు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, చదువును నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. అన్ని సదుపాయాలు ఉన్న ప్రభుత్వ బడుల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని కోరారు. ఖేడ్ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్ కృషితో విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించారని గుర్తు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గ్రంథాలయంలో తగు సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. అనంతరం టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, వైస్ ఎంపీపీ పండరి యాదవ్, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రామచంద్రాపురం: 2001-02 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) పటాన్‌చెరు పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు చెందిన 2001–02బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు దామోదర్‌రెడ్డి, నిర్వాహకులు రామానంద్‌గౌడ్, బాలకృష్ణ, సంతోషి, లావణ్య, శ్రీను, మురళి తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో...



జోగిపేట: 1980 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

జోగిపేట(అందోల్): జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో 1980 బ్యాచ్ విద్యార్థులు 43 ఏళ్ల తర్వాత ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తోటి మిత్రుడు ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందడం పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సేవా కార్యక్రమాల తీర్మానం

స్నేహం 1980 గ్రూపు ద్వారా భవిష్యత్తులో చేపట్టాల్సిన సామాజిక సేవా కార్యక్రమాలు, ఇతర అంశాల గురించి చర్చించారు. అందరూ ముక్తకంఠంతో ఏకాభిప్రాయంగా ముందుగా చదువుకున్న పాఠశాలకు సేవ చేద్దామని, విద్యార్థులకు కావాల్సిన స్కూల్ బ్యాగులు, పాఠశాలకు కావాల్సిన అవసరాలను తీర్చడానికి తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాణయ్య, మురళీ, చంద్రశేఖర్, ప్రభాత్‌కుమార్, ఆంజనేయులు, కరుణాకర్, సప్తగిరి శేఖర్, రవీందర్, శ్రీధర్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్, జనార్ధన్, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాం



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, కార్మికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. తెల్లాపూర్‌లో స్వచ్ఛత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళ్ల చెరువు పరిసరాలను మున్సిపల్ సిబ్బంది, తెల్లాపూర్ నైబర్‌హూడ్ గ్రీన్‌ఆర్మీ సంయుక్తంగా కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రజలల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంజుల, తెల్లాపూర్ నైబర్‌హూడ్ ఆసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ, గ్రీన్‌ఆర్మీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ



పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రైవేట్ పాఠశాలలు వ్యాపార దృక్పథంతో కాకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ అన్నారు. పట్టణంలోని శంభులింగేశ్వర కాలనీ సమీపంలో నూతన జీనియస్ పాఠశాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, బీజేపీ నియోజవర్గ నాయకుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ వైస్‌చైర్మన్ కంది కృష్ణ, బీజేపీ నాయకులు చంద్రశేఖర్, మాణిక్‌రావు, కౌన్సిలర్లు విశ్వనాథం, శ్రీశైలం, నాగరాజ్‌గౌడ్, పాఠశాల కరస్పాండెంట్ రఘువర్ధన్ రెడ్డి, కార్యదర్శి వెంకటేశం, అధ్యక్షుడు నాగనాథ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, డైరక్టర్లు అమరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పణీత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామానాయుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): వాహనదారులురోడ్డు నిబంధనలు పాటించాలని హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు అన్నారు. మండల పరిధిలోని హద్నూర్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపొద్దన్నారు. పరిమిత వేగంతో వాహనాలను నడపాలని, ప్రయాణికుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేతనాల కోసం కార్మికుల నిరసన

శివ్వంపేట(నర్సాపూర్): వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధి రత్నపూర్ పంచాయతీ కార్మికులు ఆదివారం విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. 4 నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు రాజయ్య, ప్రభాకర్, ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలు సైతం సక్రమంగా ఇవ్వకపోడంతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వాపోయారు. పంచాయతీకి ఆదాయ మార్గాలు లేకపోవడంతో కార్మికుల వేతనాల చెల్లింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. త్వరలోనే వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహానికి ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామ సమీపంలో 5రోజుల క్రితం భిక్షాటన చేసుకుంటూ ఉండే వృద్ధురాలు పడుకున్న చోటే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మృతురాలి బంధువుల కోసం లుక్ అవుట్ నోటీసు జారీ చేయగా ఎవరూ రాకపోవడంతో పోలీసులు ఎండీఆర్ ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, సభ్యులతో కలిసి వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

జహీరాబాద్ టౌన్: ప్రైవేట్ విద్యా సంస్థల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని బీజేపీ యువమోర్చా నియోజకవర్గం కన్వీనర్ నరేష్ పాటిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ అనిల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జహీరాబాద్‌లో విద్యా వ్యాపారంగా మారిందని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ తదితర ఫీజులు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాం, బుక్స్, నోట్‌బుక్స్‌లను పాఠశాలల్లో అమ్ముతున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు స్పందించి అధిక ఫీజులు వసూలును చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరామర్శ



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామానికి చెందిన బాలుగారి శ్రీనివాస్, నర్సింగ్‌రావుల కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నేత నీలం మధు ఆదివారం పరామర్శించారు. బాలుగారు శ్రీనివాస్ కుమార్తె ఇటీవల మరణించింది. అదేవిధంగా నర్సింగ్‌రావు రోడ్డు ప్రమాదంలో గాయపడగా బాధిత కుటుంబాలను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని నీలం మధు తెలిపారు.

కంచన్‌పల్లిలో బడిబాట

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఉపాధ్యాయుడు బాలశేఖర్ తదితరులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్య అందుతుందని తెలిపారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు నర్సింహులు

రాయికోడ్(అందోల్): గ్లోబల్ ఎన్విరాల్మెంట్, క్లైమైట్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని హస్నాబాద్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నర్సింహులు అవార్డు పొందారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ×జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ । ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయ వృత్తితో పాటు సామాజిక సేవలు అందించి నర్సింహులు ప్రజల మన్ననలు పొందాడు. ఈ సందర్భంగా ఆయనకు ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్ అవార్డును ప్రదానం చేశారు.

అవార్డుల ప్రదానం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉత్తమ ప్రతిభ చూపిన పలువురు ఉపాధ్యాయులకు వల్లూరి ఫౌండేషన్ గ్రూప్ వారు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ బంగారు కామధేనువు అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు పొందినవారిలో సదాశివపేట మండలంలోని రిటైర్డ్ ఎంఈవో అంజయ్య, నిజాంపూర్(కె), తంగడపల్లి, నాగ్సాన్‌పల్లి, మద్దికుంట, ఎల్లారం, అంకెనపల్లి పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పోట్రు రామకృష్ణ, తుల్జయ్య, వెంకటేశం, గుణాకర్, చక్రధర్‌రావు, రామలక్ష్మి ఉన్నారు. ఈ సందర్భంవగా వారికి తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ అవార్డులను ప్రదానం చేశారు. అదేవిధంగా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరాజుకు ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి మధుసూదన్, సినీ ప్రముఖులు తిరుపతి దోర్రై స్వామి, న్యూస్ రీడర్ సుధాకర్, భాస్కర్‌గుప్తా, కిరణ్, అనుప్రసాద్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



జహీరాబాద్‌లో నాయకులు, కార్యకర్తల సంబరాలు

జహీరాబాద్ టౌన్: ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి నియోజకవర్గంలో రంజోల్, గోటిగార్‌పల్లి, గౌసాబాద్, అత్నూర్, ధనసిరి తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచి పెట్టి విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పటాన్‌చెరు పట్టణంలో...



పటాన్‌చెరు టౌన్ సంబరాల్లో బీజేపీ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: ప్రధానిగా నరేంద్రమోడీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగసాని నరేష్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు. ముందుగా ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసగుప్తా, డివిజన్ ప్రధాన కార్యదర్శి సునిల్, ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, మోహన్, కార్యదర్శులు శ్రీనివాస్‌చారి, జీవన్‌సింగ్, వెంకట్‌గౌడ్, తిరుపతి, లక్ష్మణ్ మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు రజని పాల్గొన్నారు.